క్లుప్తంగా

ఎస్సైని కలిసిన నాయకులు



గోవిందరావుపేట: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పస్రా ఎస్సై అచ్చ కమలాకర్‌ను శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి పార్టీ ములుగు ఇన్‌చార్జ్ పసులాది ముఖేష్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల అధ్యక్షుడు కోగిల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్ఐ బదిలీ



వాజేడు: వాజేడు ఆర్ఐగా పని చేస్తున్న కాట రాజు ఎస్ఎస్ తాడ్వాయి మండలానికి బదిలీ అయ్యారు. దీంతో బదిలీపై వెళ్తున్న కాట రాజును తహసీల్దార్ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, సిబ్బంది సన్మానించారు.

నేడు చెక్కుల పంపిణీ

మంగపేట: మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నేడు (శనివారం) నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బైరి వీరస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 02 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హాజరవతున్నారని తెలిపారు. లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

చర్య తీసుకోవాలి



ములుగు రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు కొనసాగిస్తున్నారని అన్నారు. వేసవి తాపానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బాలు, శివకేశవ, బైరేష్, మను తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బయటికి పంపొద్దు

కన్నాయిగూడెం: విద్యార్థులకు శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం అవడంతో మధ్యాహ్నం ఇంటికి వస్తున్న పిల్లలను తల్లిదండ్రులు బయటికి వెళ్లకుండా చూసుకోవాలని ఎస్సై సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటికి వచ్చిన విద్యార్థులను ఈతలు కొట్టడానికి మండలంలోని జలాశాయాలకు, చెరువు, కుంటలు, బోరుబావుల గోదావరిలోకి వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున వడగాలులు తగిలే ప్రమాదాలు ఉన్నాయని పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

కాన్షీరాం జయంతి

చిట్యాల: మండల కేంద్రంలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం అండేడ్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీ కృష్ణ హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహానీయుడని అన్నారు. ఓటు హక్కుతోనే రాజ్యాధికారం సాధించవచ్చని, ఓటును అమ్ముకోవద్దని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు తోట సతీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆర్యవైశ్య కార్పొరేషన్ అమల్లోకి తెచ్చి ఆర్యవైశ్య కులస్తుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పేద ఆర్యవైశ్యులకు ఎనలేని లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆర్యవైశ్యుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జె.చిన్న



ములుగు: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమ్మయ్య

ఏటూరునాగారం: వినియోగదారులు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.చిన్న అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కామర్స్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.చిన్న మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న వ్యాపారాలలో వినియోగదారులు అనేక రకాలుగా మోసపోతున్నారన్నారు. ముఖ్యంగా ఈ-కామర్స్ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోళ్లు, అమ్మకాల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ పేమెంట్‌ల ద్వారా జరిగే మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, ఎం.ఘన్‌సింగ్, టి.రమేష్‌కుమార్, కనీస్ ఫాతిమా, సిహెచ్ వెంకటయ్య, జ్యోతి, సంపత్, శ్రీధర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

ములుగు: వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సమ్మయ్య సూచించారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల వినియోగదారుల మండలి కన్వీనర్ డాక్టర్ యాకూబ్, సభ్యురాలు ఉమాదేవి, అకాడమిక్ కో ఆర్డినేటర్ వెంకన్న, అధ్యాపకులు మహేందర్, నాగమణి, అనిల్‌కుమార్, విజిత, శంకర్, తేజోలత, శ్రీను, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. డీఈఓగా రాజేశ్వరి, ఎంఈఓగా ప్రమోద్, ప్రధానోపాధ్యాయురాలిగా కత్తుల సింధూ, ఉపాధ్యాయులుగా తరుణ్, అజయ్, దివ్య, అమూల్య, చైతన్య, సాయి, సిరి, ఫణి, కిశోర్‌తో పాటు తదితరులు వ్యవహరించారు.

అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న పూజారులు, ఈఓ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలోని పూజారుల అతిథి గృహం నిర్మాణ పనులను శుక్రవారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఈఓ రాజేంద్రం ప్రారంభించారు. మేడారం జాతర సమయంలో సమ్మక్క– సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల పూజారులు, ఇతర పూజారులు స్థానికంగా ఉండి పూజాలు నిర్వహించడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి సీతక్క, కలెక్టర్‌కు పూజారులు, ఈఓ విన్నవించిన నేపథ్యంలో పూజారుల అతిథి గృహం నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఈ ఏడాది జాతర ముందు మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా శుక్రవారం ఈ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతి, కాంట్రాక్టర్ శ్రీధర్, ఏఈ వీరచందర్, ప్రొటోకాల్ అధికారి సమ్మయ్య, పూజారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గోవిందరావుపేట: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తాడ్వాయి ప్రాజెక్ట్ సీడీపీఓ మల్లీశ్వరీ, సూపర్ వైజర్ అనంతలక్ష్మి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమాలలో భాగంగా మండల పరిధిలోని బుస్సాపూర్, చల్వాయి గ్రామలలో శుక్రవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో మహిళలు, గర్భిణులు, కిశోర బాలికల్లో ఉన్న రక్త హీనత శాతాన్ని తగ్గించేందుకు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు కృషి చేయాలని అని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ తీసి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేర్ వర్కర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్స్ సీహెచ్ అరుంధతి దేవి, మోక్షరాణి, అలివేలు, ఆయాలు లక్ష్మి, శౌరిలమ్మ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని బుస్సాపూర్, చల్వాయి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ పరిశీలించారు. పోలింగ్ సెంటర్లలో గతంలో నిర్వహించిన ఎన్నికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను పోలీస్ శాఖ ముందస్తుగా ఏర్పాటు చేస్తుందని అన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం..



మాట్లాడుతున్న సత్యనారాయణ

వెంకటాపురం(కె): కొమరంభీం కాలనీకి చెందిన ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ గోండ్వానా సంక్షేమ పరిషత్ వారికి అండగా ఉండి పోరాటం చేస్తుందని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొమురం భీం కాలనీలో పూనెం సాయి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరం భీం కాలనీకి చెందిన పది ఆదివాసీ కుటుంబాలు 30 సంవత్సరాలుగా కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, రాజబాబు, లక్ష్మయ్య, రాజేష్, లోకేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల అక్రమ పట్టాపాస్ పుస్తకాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ.. మండలంలో ఆలుబాక జెడ్‌లో అనేక మంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు చేసుకున్నారని అధికారులు విచారణ చేసి పట్టాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణబాబు, నేత్రనందకుమార్, సాంబ శివరావు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కలిగేలా శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు గోపగాని విక్రమ్, యార దేవేందర్ ఆధ్వర్యంలో పోటీ చేసే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, అధికారులు, ఓటర్లు, ఓటు వినియోగం, బ్యాలెట్ బాక్సు, ఓట్ల లెక్కింపు తదితర వాటిని ఏర్పాటు చేసి పోలింగ్ సరళిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హైమవతి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, నిజాయితీగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ యార సుజాత అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎవరైన అక్రమంగా ఇసుక రవాణా చేస్తే దొంగలను పట్టుకోని మైనింగ్ కేసులు నమోదు చేయాలని తహసీల్దార్ సునీతకు, ఎస్సై అశోక్‌కు సూచించారు. ఇళ్లు కట్టుకునే వారికి, అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక పర్మిషన్ ఇవ్వాలని తెలిపారు. పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీటికి, తాగు నీటికి సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారిచేయాలని ఎంపీడీఓ జయశ్రీని ఆదేశించారు. రంగాపురం గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ వైస్ ఎంపీపీ రాజేశ్వరరావు తెలిపిన అంశానికి ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కారించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రతి కూలికి 100రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పంట పొలలకు మట్టిని పోయించుకునే రైతులకు అభ్యంతరం చెప్పద్దని అధికారులకు సూచించారు. మండలంలోని తెగిపోయిన అన్ని గ్రామాల చెరువులకు మరమ్మతుల చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వరరావు, ఎంపీటీసీలు సుధకార్, రాంచంద్రారెడ్డి, నరహరి కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన మామిడి శెట్టి కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం మంత్రి సీతక్క తనయుడు, కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య పరామర్శించారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, మామిడిశెట్టి కోటి, ధర్మతేజ, చాంద్‌పాషా, రాజేశ్వర్‌రావు, భూస గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

ములుగు: ములుగు పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా అని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్ యాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రంగారావుపల్లి సమీపంలో రూ.6లక్షలతో నేషనల్ హైవే నుంచి అయ్యప్పస్వామి టెంపుల్ వరకు, రూ.రెండు లక్షలతో వీవర్స్ కాలనీలకు మంజూరైన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీంతో పాటు బృందావన కాలనీ, చుట్టూ పక్కల రూ.14లక్షలతో సైడ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అవసరం ఉన్న చోట సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు చేపట్టడానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొర్రె సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ జానమ్మ, గడ్డమీది భాస్కర్, రామారావు, రాజు, చిన్న రాజు, గణేష్, శ్రీను, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



మాట్లాడుతున్న ఎస్సై రమేష్

వాజేడు: మావోయిస్టులకు ప్రజలు సహకరించొద్దని పేరూరు ఎస్సై రమేష్ అన్నారు. మండల పరిధిలోని దుబ్బగూడెం గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుకొని మంచి ఉద్యోగాలను పొందాలన్నారు. అవసరమైతే అందుకు తమ వంతు సహకారం చేస్తామని తెలిపారు. గంజాయి, గుడుంబా, బెల్లం, పటికలాంటివి సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు.

'గాలికుంటు' టీకాలు వేయించాలి



వెంకటాపురం(ఎం): టీకా వేస్తున్న సిబ్బంది



ఎస్ఎస్ తాడ్వాయిలో..

వెంకటాపురం(ఎం): రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు నటరాజ్, సుధారాణి, అనూష తెలిపారు. మండలంలో గాలికుంట టీకాలు వేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు నర్సాపూర్, లక్ష్మీదేవిపేట పరిధిలో శుక్రవారం 186 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ ఆఫీసర్లు స్వర్ణలత, వేణు, ప్రశాంత్, రమేష్, రాములు, తేజ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని నర్సింగాపూర్ గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ గ్రామాల్లో 204 పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నీ అసిస్టెంట్ రాజు తెలిపారు. ఈనెల 18 వరకు పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర రాంబాబు, అటెండర్ శ్రీనాథ్‌తో పాటు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ గిరి

కన్నాయిగూడెం: మండంలోని ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యులు ఎంసీహెచ్.గిరి అన్నారు. మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ గిరి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వివిధ రోగాలతో పీడించబడుతున్న రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సంద్భంగా గిరి మాట్లాడుతూ.. 76 మందికి ఓపీ చూడగా అందులో 11 మంది జ్వరంతో బాధపడుతున్నారని వారికి రక్త పరీక్షలు చేయగా ఎలాంటి పాజిటివ్ కేసులు లేవని తెలిపారు. వివిధ బాడీ పేన్స్‌తో బాధపడుతున్న 16 మంది రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి ములుగులోని తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరి మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులకు వెళ్తున్న ప్రజలు ఉదయం వెళ్లి 9గంటల వరకు ముగించుకోని ఇంటికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ ల్యాబ్ టెక్నీషణ్ సురేష్, ఆశాలు తులసి, రజిని కుమార్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలని రాస్తారోకో..



రాస్తారోకో చేస్తున్న ఆలుబాక గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో శుక్రవారం ఆలుబాక గ్రామానికి చెందిన సాహితి మృతి కారకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై బైఠాయించి గ్రామస్తులు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ నిలిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్, తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ సంఘటన ప్రాంతానికి చేరుకోని బాధితులతో మాట్లాడి ఉన్నతాధికారులతో మాట్లాడి సాహితి కుటుంబానికి న్యాయం చేసేలా కృషి చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.